“ఓం నమో భగవతే శ్రీ రమణాయ”

# శ్రీ నాన్నగారితో సంభాషణలు

ఆంధ్ర ఆశ్రమం
11.03.1998

**మహాలక్ష్మి గారు అడిగిన ప్రశ్నలకు శ్రీ నాన్నగారి సమాధానములు**

**1. మీరు ఎవరు? ఈ జన్మలో మీ పని ఏమిటి?**

**శ్రీ నాన్నగారు** :- నేను ప్రజానీకాన్ని ప్రేమించేవాడిని. ఈ జన్మలో నా పని ఆధ్యాత్మిక అభివృద్ధిని ప్రోత్సహించటం, సహకరించటం మరియు సత్య స్వరూపాన్ని తెలియపరచటం.



**2. గురువు అంటే ఏమిటి? గురువు అంటే ఎవరు?**

**శ్రీ నాన్నగారు** :- గురువు - భగవంతుడు - స్వరూపము అన్నీ ఒక్కటే. బయట గురువు నీ మనస్సుని పరమాత్మ వైపుకి తిరిగేలా సహాయపడతాడు. లోపల ఉన్న గురువు నీ మనస్సుని దాని మూలం వైపుకు లాగుకుంటాడు. గురువు మన మనస్సులోని బలహీనతలను మనకి తెలియపరుస్తాడు. గురువు యొక్క అనుగ్రహం మనకు మన వాసనలను పోగొట్టుకోవటానికి కావలసిన శక్తిని ఇస్తుంది. నీలోని చెడు అలవాట్లను పారత్రోలటం, వాటిని పూర్తిగా నాశనము చేయటం గురువు పని. భగవంతుడికి నీ అలవాట్లు, నీ బలహీనతలు అన్నీ తెలుసు. ఎందువలన అంటే గురువు నీలోనే


ఉన్నారు. మన నిజ స్వరూపమే గురువు.

**3. ఆధ్యాత్మిక పురోభివృద్ధికి, మన సహజ స్వరూపాన్ని మనం తెలుసుకోవటానికి గురువు అవసరమా?**

**శ్రీ నాన్నగారు** :- ఆధ్యాత్మిక పురోభివృద్ధికి తప్పకుండా గురువు ఆవశ్యకత, అనుగ్రహము అవసరము.

**4. మీ బోధనలు ఏమిటి?**

**శ్రీ నాన్నగారు** :- నీ నిజస్వరూపము మేల్కొనటానికి ఆత్మానుభవాన్ని తెలుసుకోవాలి. ఈ సత్యస్వరూపము నీ హృదయంలో ఎల్లప్పుడూ ఉంది. ఆ ఎల్లప్పుడూ ఉన్న దానిని తెలుసుకోవాలి.



**5. శిష్యుడు ఏ ప్రయత్నం చేయాలి?**

**శ్రీ నాన్నగారు** :- భగవంతుడి మీద గట్టి నమ్మకము ఉంచి ఆయనకు పూర్తి శరణాగతి అవ్వాలి.

**6. మీరు మౌనం మన మనస్సుని తన మూలాన్ని అన్వేషించటానికి సహాయపడుతుంది అని చెప్పటం విన్నాను. దానిని గురించి వివరించగలరా?**

**శ్రీ నాన్నగారు** :- మౌనం అన్ని మార్గాల కంటే ఉత్తమమైన మార్గం. మౌనం ఉత్తమమైనది, మౌనం ఉత్తమమైనది. మౌనం బోధిస్తుంది. గురువు యొక్క మౌనం శిష్యుడి మనస్సుని పక్కానికి తెచ్చి, శిష్యుడి మనో మూలాన్ని తెలుసుకోవటానికి సహాయ పడుతుంది. ఈ మూలాన్ని తెలుసుకుంటే మనిషి స్వస్వరూపం బయట పడుతుంది. అదే మోక్షం, అదే ముక్తి.

**7. మీరు మీ భక్తులలో పుట్టించే ప్రేమను గురించి వివరిస్తారా?**

**శ్రీ నాన్నగారు** :- నాకు నా భక్తుల మీద అసాధారణ ప్రేమ ఉంది. దానివలన వారు వారి బాధలను మరువగలుగుతున్నారు.

**8. రమణుడు అరుణాచల శిఖరాన్ని తన గృహం అని, శివుడు అని, తన స్వరూపము అని, తన గురువు అని అన్నారు. మీకు అరుణాచలం మీద, రమణుడి మీద ఏ విధమైన సంబంధం ఉన్నది?**

**శ్రీ నాన్నగారు** :- రమణుడు, అరుణాచలం అంతా ఒక్కటే. ఉన్నది ఒక్క ఈశ్వరుడే. ఈ దేహంతో మనం అనుకుంటున్న "నేను" అసలు నేను కాదు. మీకు తెలిసినా, తెలియకపోయినా మీరు అరుణాచలం వైపు ఆకర్షింప పడతారు. మీకు ఉన్న అనుబంధం వలన మీరు అరుణాచలానికి ఆకర్షింప పడుతున్నారు. ఈ ఆకర్షణ చాలా మంచిది. దీనివలన మీరు అహంకార రహిత జీవితాన్ని జీవించ గలుగుతారు. ఎవరైతే అరుణాచలం వైపు ఆకర్షింప పడతారో వారు అరుణాచలం ద్వారా ముక్తిని పొందుతారు. మనము అరుణాచలం అనుగ్రహము ద్వారా అరుణాచలం వైపు ఆకర్షింప పడుతున్నాము. అరుణాచలం అనుగ్రహము ద్వారా మన అహంకారం తల్లక్రిందులయిపోతుంది.

**రమణుడు** :- నేను ఆయనను నిరంతరంగా ప్రేమిస్తున్నాను. ఈ జన్మలో నేను ఆయనను దేహంతో ఉన్నప్పుడు చూడలేదు. 1957వ సంవత్సరంలో ఆయన నా స్వప్నంలో కనిపించి నా కుడి బుగ్గమీద ముద్దు పెట్టుకుని "ఇప్పటికి ఇది చాలు" అని అన్నారు. నేను ఒక్క విషయం ఖచ్చితంగా చెప్పగలను. నాకు, అరుణాచలానికి పూర్వ జన్మ సంబంధం ఉన్నది. నాకు రమణునితో చాలా గట్టి mental contact ఉన్నది. ఆయన అంటే నాకు చాలా గౌరవము, భక్తి ఉన్నది. అప్పుడప్పుడు ఆయన నాకు అత్యంత సన్నిహిత బంధువు అని అనుకుంటాను. ఆయన నా సన్నిహిత స్నేహితుడు. తల్లి ప్రేమకు మించిన అనురాగం



ఆయన నాకు ఇచ్చారు. ఆయన నా తల్లి - తండ్రి - గురువు -దైవము. నాకు కావలసినదంతా ఆయన ఇచ్చారు. నేను ఆయనను ప్రేమిస్తున్నాను, ఆయన కొరకు జీవిస్తున్నాను. "<u>నడిచే అరుణాచలమే రమణుడు</u>". 30 సంవత్సరాల నుండి నేను రమణుడి మీద కేంద్రీకృతమైన జీవితాన్ని జీవిస్తున్నాను. ఆయన జీవితము, ఆయన బోధనలు నన్ను ప్రభావితం చేశాయి. నేను ఆత్మానుభవాన్ని అన్వేషించటానికి ఆయన నాకు సహకరించారు.

**9. రమణుని బోధనలు "నేనెవరిని?" అని అన్వేషించడం - అద్వైత సిద్ధాంతం. ఇప్పుడు కృష్ణుడి బృందావనంలో మనం కృష్ణుడి రూపాన్ని, అందమైన గోపికలను ఆరాధిస్తున్నాము. భక్తి మార్గానికి, అహం మూలాన్వేషణ ద్వారా "నేనెవడను?" అని తెలుసుకోవటానికి ఉన్న సంబంధం ఏమిటి?**

**శ్రీ నాన్నగారు** :- భక్తి అవసరము. నేనెవడను (అహం మూలాన్వేషణ) తెలుసుకోవటానికి భక్తి సహాయపడుతుంది. భక్తి లేకుండా నేనెవడను అని అన్వేషించటం పంచదార లేని కాఫీ వంటిది.

**10. గురువు అనుగ్రహం వలన, గురువు చూపు వలన ఏమి జరుగుతుంది? మీరు మా కనుల వంక చూసినప్పుడు ఏమి చూస్తున్నారు?**

**శ్రీ నాన్నగారు** :- గురువు చూపుతో మీకు గురువు అనుగ్రహం ఇస్తారు. గురువు అనుగ్రహం ద్వార నీవు నీ నిజ స్వరూపాన్ని తెలుసుకోవటానికి సహకరిస్తుంది. గురువు యొక్క అనుగ్రహం నీ అన్వేషణా మార్గాన్ని లోతులలోనికి తీసుకుని వెళ్తుంది. మీ కళ్లల్లోకి నేను చూసినపుడు మీరు ఏమిటో, మీ స్వరూపం ఏమిటో నాకు తెలుస్తుంది. మీ నిజ స్వరూపాన్ని చూస్తాను, మీ దేహాత్మభావనను కాదు. మీరు ఈ దేహమూ కాదు, ఈ ఆత్మా కాదు.



**11. నిజ స్వరూపాన్ని తెలుసుకోవాలంటే మనో నిగ్రహము, ఇంద్రియ నిగ్రహము అవసరము అని మీరు బోధిస్తారు కదా? మనస్సు, ఇంద్రియ లోతులు చూడటం అలవాటు లేని మాలాంటి దూర దేశస్థుల వారికి మీరు దేనిని గురించి బోధిస్తారు?**

**శ్రీ నాన్నగారు** :- ఎల్లప్పుడూ సత్యమే ఆచరించండి. ఎరుకను తెలుసుకోవటం అవసరం. ఎరుకను అర్థం చేసుకోవటం అవసరము. అహంకార రహితమైన జీవితాన్ని జీవించాలి. అహంకార రహితమైన మీ నడవడిక కనిపించాలి. అబద్ధం చెప్పవద్దు, మోసం చేయవద్దు. అసూయ, ద్వేషము విడిచి పెట్టండి. మీ మనస్సును జాలితోను, మంచితనంతోను, మమతతోను, నిస్వార్థము తోను ఉంచగలిగితే అది మీ ఆధ్యాత్మిక పురోగతికి సహాయపడుతుంది.

**12. మీ పుస్తకములో మన ధ్యేయం మనల్ని మనం తెలుసుకోవటమే అని ఉంది. ఇప్పటివరకూ అసలు ఇండియా చూడనివారికి, గురువుల గురించి, సాధన గురించి ఏమి తెలియని వారికి, కాని వారిలో నిజతత్వాన్ని తెలుసుకోవాలి అనే ఆసక్తి ఉన్న మాలాంటి దూర దేశస్థులకు మీరు ఏమి బోధిస్తారు?**

**శ్రీ నాన్నగారు** :- నిరాడంబర జీవితాన్ని జీవించండి. ఎరుకతో (clarity) ఉన్న ఆలోచనలు, ఎరుకతో ఉన్న బోధనలు, ఎరుకతో ఉన్న పనులు చేయండి. ఉదారత్వంగా ఉండగలిగి ఉండాలి. వివేకం, వినయం కలిగి ఉండాలి. మనం తూర్పు దేశస్థులమయినా, పశ్చిమ దేశస్థులమయినా మంచి ఆలోచనలతో జీవించాలి. తెలిసి అయినా, తెలియక అయినా, సత్య మార్గాన్నే అనుసరించాలి. అలా జీవించినపుడే మన సహజ స్వరూపం మనకు తెలిసి వస్తుంది. మన జీవిత ధ్యేయాన్ని అర్థం చేసుకోవాలి.



పూజ్యులైన గురువుగారు నేను, గురువు అన్నవారు ఒక్కరే ఉన్నారన్న నిజాన్ని తెలుసుకున్నాను. మీకు నా హృదయ పూర్వక వందనములు. ఈ ప్రశ్నలు అన్నీ మీ పాదాల చెంత ఉంచుతున్నాను. మీ అనుగ్రహానికి పాత్రురాలినయితే, మీరు వీటికి జవాబులు ఇస్తే మీ దర్శన భాగ్యము సఫలీకృతమవుతుంది. దీని ద్వారా నా స్నేహితులకు మీ పిలుపు అందుతుంది. పాపాజీగారు ఒకసారి ఇలా అన్నారు. మన అందరి హృదయ లోతులలో ఉన్నది "భగవాన్ రమణ".

మీరు ఎలా అనుగ్రహిస్తే అలా జరుగుతుంది
మీ అనుగ్రహానికి నా ధన్యవాదములు

ప్రేమతో మరియు కృతజ్ఞతతో
మహాలక్ష్మి